
గుడిసెవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రభుత్వం ద్వారా సాయం అందించే బాధ్యత నాదే

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): నాగోల్ సాయినగర్‌లో ప్రమాదవశాత్తు గుడిసెలు కాలిపోయిన బాధితులకు ప్రభుత్వం ద్వారా తగిన సాయం అందే వరకు బాధ్యత వహిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్‌లో మంగళవారం గుడిసెలు కాలిపోయిన తీరును బుధవారం మరోసారి పరిశీలించి ఎమ్మెల్యే బాధితులను పరామర్శించి 'మీకు నేనున్నానంటూ' భరోసా కల్పించారు. ఈసందర్భంగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన సుధీర్‌రెడ్డి తక్షణ సాయం కింద వారికి రూ.8వేలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క గుడిసె వాసి ఇందిరమ్మ ఇళ్ల కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, కలెక్టర్‌తో మాట్లాడి పక్కా ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీ సుజాత, బీఆర్‌ఎస్ నాగోల్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకుడు ప్రశాంత్‌గౌడ్, సతీష్‌యాదవ్, చందు, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లో సీసీ రోడ్లు మంజూరు చేయండి

వనస్థలిపురం, మే 7(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో అంతర్గత సీసీ, బీటీ రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వీ కర్ణన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఎస్కేడినగర్, బీఎన్‌రెడ్డినగర్‌కాలనీ, సెల్ఫ్ ఫైనాన్స్‌కాలనీ, సచివాలయనగర్, హరిహరపురం, వైదేహినగర్‌నార్త్‌కాలనీ, సాయిరాంకాలనీ, విజయపురికాలనీ ఫేజ్-1, ఫేజ్-2, వెంకటేశ్వరకాలనీ, గాయిత్రీనగర్ బ్యాంక్‌కాలనీ, టీచర్స్‌కాలనీ ఫేజ్-2, గాయిత్రీనగర్ ఫేజ్-4, విజయనగర్‌కాలనీ, ఆఫీసర్స్‌కాలనీ, గాయిత్రీనగర్ ఫేజ్-2 కాలనీల్లో సరైన రోడ్లు లేకపోవడంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన రోడ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరలోనే నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరిస్తానని కమిషనర్ తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందొరెడ్డి పాల్గొన్నారు.


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సరూర్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు పేద, బడుగు వర్గాలకు వరంగా మారాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతి, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, భాగ్యనగర్ రైతు సహకార సంఘం ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, డైరెక్టర్ చిగిరింత నర్సింహారెడ్డి, కౌన్సిల్ బీఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్జగంటి అర్జున్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.


సబిత ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కామేశ్‌రెడ్డి తదితరులు

జిల్లెలగూడలో సబిత ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

సరూర్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి ఓబుళాపురం మైనింగ్ కేసులో క్లీన్ చిట్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆమె ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. బాణసంచా కాల్చి స్థానికులకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబితారెడ్డి అంకితభావంతో పనిచేసి తన పదవులకు వన్నె తెచ్చారేగానీ ఏనాడూ అవినీతి అక్రమాలకు పాల్పడలేదని అన్నారు. చివరకు న్యాయమే గెలిచిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, శ్రీనునాయక్, దీప్‌లాల్, సిద్దాల బీరప్ప, అనిల్‌యాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, సునీత, విజయలక్ష్మి, మాదరి రమేశ్, గోపీయాదవ్ పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

బండరావిరాలలో శాస్త్రవేత్తల అవగాహన సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండరావిరాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ కే కవిత, డాక్టర్ ఎస్ జెమీమా హాజరై వ్యవసాయంలోని వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించి పలు సలహాలు, సూచనలు చేశారు. పంటల్లో రసాయనాల వినియోగం, తెగుళ్లు, నేల సారం పెంచే విధానాలు, పంట మార్పిడి ప్రయోజనాలు, నీటి వినియోగం, పర్యావరణ రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించారు. వరి వంగడాలు వాటి లభ్యతపై వివరిస్తూ వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విశ్వవిద్యాలయం యూట్యూబ్ చానల్ ద్వారా తెలుసుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పల్లవి, విస్తరణ అధికారి రఘుపతి, మధుసూదనచారి, నవనీత, మేధ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ఆస్తమా తీవ్రత పెరుగుతోంది

మన్సూరాబాద్ : ఆస్తమా ఉందని గుర్తించిన తర్వాత కూడా మందులు సరిగా వాడకుంటే వ్యాధి తీవ్రత ఎక్కువవుతోందని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఉంటే ఆస్తమాను అదుపు చేయొచ్చని కామినేని ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ ఇ.రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్తమా వ్యాధి పట్ల పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో పల్మనాలజీ విభాగం వైద్యులు డా.కంది సుధాకర్, డా.డీఎస్ సౌజన్య, డా.భరత్ పాల్గొన్నారు.


కంచన్‌బాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం ప్రధాన రహదారిపై నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్


గాయాలకు గురైన క్షతగాత్రులను స్థానికులు బుజాలపై అంబులెన్స్‌కు తరలింపు


సైరన్ మోగిస్తున్న డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు


మాక్ డ్రిల్‌పై పౌరులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పోలీసుల మాక్‌డ్రిల్


హయత్‌నగర్ బస్టాండ్‌లో ప్రమాదాన్ని తప్పించుకునేలా తలదాచుకుంటున్న ప్రజలు

హయత్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ రక్షణశాఖ ఆదేశం మేరకు అత్యవసర సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం హయత్‌నగర్ బస్టాండ్‌లో పలు విభాగాలకు చెందిన అధికారులు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించారు. హయత్‌నగర్ పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, ఫైర్, ట్రాఫిక్ పోలీసులు, డిజాస్టర్ సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. అత్యవసర సమయంలో ప్రజలు తమకుతాము ఎలా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, డీటీ అనీల్‌కుమార్, స్వేత, ఆర్‌ఐలు నర్సింహయాదవ్, రమేష్, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, ట్రాఫిక్ సీఐ గట్టు మల్లు, ఫైర్ ఆఫీసర్ యాదగిరి, పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


వనస్థలిపురం పనామా వద్ద మాక్ డ్రిల్ కార్యక్రమంలో పాల్గొన్న వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ఇతర సిబ్బంది

కంచన్‌బాగ్‌లో..

చంపాపేట: కంచన్‌బాగ్‌లో పోలీసులు, ఆయాశాఖల అధికారులతో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. కంచన్‌బాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై పోలీసులు సైరన్ మోగించి దాడులు జరిగిన సమయంలో భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్డీవో టౌన్‌షిప్ ఎస్టేట్ మేనేజర్ వినోద్‌కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ వై.కమల్ కుమార్, ఎస్ఐ వినోద్ పాల్గొన్నారు.


అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బుజాల మీద తీసుకు వెళ్తున్న డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది

ఐఎస్‌సదన్ ట్విన్ టవర్స్ బీపీఎస్‌లో..

సంతోష్‌నగర్: ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్విన్ సిటీస్ టవర్స్ బీపీఎస్‌లో సౌత్-ఈస్ట్ డీసీపీ కాంతిలాల్ సుభాష్‌పాటిల్, అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ లో హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి, ఆర్డీఓ రామకృష్ణ, సౌత్ జోన్ డీసీపీ అశోక్ పాల్గొన్నారు.

మలక్‌పేట, చాదర్‌ఘాట్‌లో..

చాదర్‌ఘాట్: మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు, ప్రజలతో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. చాదర్‌ఘాట్ పోలీసులు మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో, మలక్‌పేట పోలీసులు మూసారాంబాగ్ చౌరస్తాలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారీ, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో..

సరూర్‌నగర్: మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మీర్‌పేట్ పోలీసులు, బాలాపూర్ రెవెన్యూ విభాగం, వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో చౌరస్తాకు నలువైపులా మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కీసరి నాగరాజు, బాలాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారీ తదితరులు

వనస్థలిపురం: ఆపరేషన్ అభ్యాస్ పేరుతో వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పనామా చౌరస్తా, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం చౌరస్తాల్లో పోలీసులు డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


కంచన్‌బాగ్ కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ప్రజలకు దాడులపై అవగాహన కల్పిస్తున్న ఆయా శాఖల సిబ్బంది

అక్రమ చొరబాటుదారులను గుర్తించి తరిమికొట్టాలి

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్

ఎల్బీనగర్, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న అక్రమ విదేశీ చొరబాటుదారులను తక్షణమే గుర్తించి వారి వారి దేశాలకు తరిమికొట్టాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్ కోరారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బెంగరబోయిన సురేష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సరూర్‌నగర్ భగత్‌సింగ్‌నగర్, బాలాపూర్ తదితర ప్రాంతాల్లో అక్రమ చొరబాటుదారులు పాతుకుపోయారని వారందరిని తక్షణమే గుర్తించి తరిమివేయాలని కోరారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణంలో వారి నుంచి అంతర్గత భద్రతకు ముప్పు రాకుండా వారిని తక్షణమే వారివారి దేశాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు సిద్దు ముదిరాజ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పంతంగి రంజిత్‌కుమార్, నాయకులు సాతెల్లి సాయిరాజ్, దమ్మ రాకేష్‌యాదవ్, వెంకట్, చంటి పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : నాగోల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నివాసముంటున్న, పనులు చేస్తున్న విదేశీయులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ కోరారు. ఈ మేరకు బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పంగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యనాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా విదేశీయులు, ముఖ్యంగా రోహింగ్యాలు, బంగ్లా, పాకిస్థాన్ దేశీయులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేందర్ యాదవ్, కేశిరెడ్డి పద్మారెడ్డి, కాలంశెట్టి లయ, కొప్పెర శ్యామల, బద్దం బాలకృష్ణగౌడ్, సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవరెడ్డి పాల్గొన్నారు.


ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం : నర్సిరెడ్డి

ఎల్బీనగర్, మే 7(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరించే నాలు గు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మల్లెపాక వీరయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ, జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ జాయింట్ కమిషనర్‌కు బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుపతలపెట్టిన కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మల్లెపాక వీరయ్య, మత్స్య కార్మిక సంఘం నాయకులు సీహెచ్ వెంకన్న పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : దేశవ్యాప్తంగా ఈనెల 20న జరపతలపెట్టిన కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేద్దామని ఏఐటీయూసీ ఎల్బీనగర్ జోన్ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల ఉపకమిషనర్లకు బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ కార్యదర్శి లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసమ్మ, రాములమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.


ఎల్బీనగర్ జోనల్ జాయింట్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నేతలు

సాయినగర్ గుడిసె వాసులకు 'డబుల్' ఇల్లు కట్టిస్తాం

మన్సూరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ సాయినగర్‌కాలనీ గుడిసెవాసుల్లో నివాసితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తామని మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ హామీ ఇచ్చారు. విద్యుదాఘాతంతో నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలోని గుడిసెల్లో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. కాగా మేడ్చల్ మల్కాజిగిరి ఆర్డీవో, ఉప్పల్ తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ బుధవారం కాలిపోయిన గుడిసెలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతం మాట్లాడుతూ జరిగిన నష్టాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి బాధిత కుటుంబానికి తగిన సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఇతర ఉన్నతాధికారులు, వివిధ పార్టీల నాయకులు చింతల సురేందర్‌యాదవ్, చిరంజీవి, చందు పాల్గొన్నారు.


అధికారులు, స్థానిక నాయకులతో కలిసి గుడిసెల్లో అగ్ని ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

చర్లపల్లి-బెర్హంపూర్ మార్గంలో 16 వేసవి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ : వేసవి రద్దీని పురస్కరించుకొని చర్లపల్లి- బెర్హంపూర్ మార్గంలో 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ఈనెల 9నుంచి జూన్ 27వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15 గంటలకు చర్లపల్లి నుంచి బెర్హంపూర్‌కు (07027) ప్రత్యేక రైలు, ఈనెల 10నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం బెర్హంపూర్ నుంచి చర్లపల్లికి (07028) ప్రత్యేక రైలు బయల్దేరుతాయని సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. మార్గమధ్యంలో (ఇరువైపులా) ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపాడ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణ నిర్మాణాల కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని తట్టిఅన్నారం పరిధిలోని సర్వే నంబర్ 117 ప్రభుత్వ భూమిలో వెలసిన రెండు ప్రహరీలు, ఒక గదిని తహసీల్దార్ ఆదేశాల మేరకు బుధవారం ఆర్ఐ రాము సిబ్బందితో కలిసి ఎక్సకవేటర్‌తో కూల్చివేశారు. సదరు సర్వే నంబర్‌లో 1 ఎకరా 17గుంటల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు గుర్తించారు. ఆ స్థలంలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేశారు. ఆర్ఐ ఇంద్రాని, సిబ్బంది పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాపై అవగాహన పెంచుకోవాలి

కొత్తపేట : మనుషుల అక్రమ రవాణాపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఎస్పీఓ కే.అరుణారెడ్డి, కానిస్టేబుల్ జి.రజిత సూచించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఏహెచ్‌టీయూ సీఐ దేవేందర్ ఆదేశాల మేరకు బుధవారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఎల్బీనగర్ జోనల్ క్యాంపస్‌లో వారు మనుషుల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక దాడులు, వ్యభిచారం కోసం, మనుషులు అవయవాల వినియోగం కోసం అక్రమంగా, చట్టవిరుద్ధంగా మోసగాళ్లు చేపట్టే కిడ్నాపులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రూప, వైస్ ప్రిన్సిపాళ్లు హృశిత, 400మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

ఒకే సారి ఎన్నికలతో దేశానికి లాభం: కార్పొరేటర్

కొత్తపేట, మే 7(ఆంధ్రజ్యోతి): ఒకే సారి ఎన్నికలు నిర్వహించడం దేశానికి అన్ని విధాలా లాభమని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం వన్ నేషన్ వన్ ఎలక్షన్ - బీజేపీ దృక్కోణం ఎన్నికల సంస్కరణలు అనే అంశంపై కార్పొరేటర్ కార్యాలయంలో సమీక్ష/చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, సుందర్‌నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని సేల్స్‌మన్ మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 7(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని సేల్స్‌మన్ మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంకు చెందిన పోతర్ల యశ్వంత్(22) ఓ కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. కాగా బుధవారం విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లికి వెళ్లాడు.. పని ముగించుకుని తిరిగి నగరానికి వస్తుండగా కొత్తగూడెం సమీపంలోని స్వగృహ వెంచర్ వద్దకు చేరుకోగానే ఎదురుగా ఓవర్ స్పీడుతో వచ్చిన మ్యాజిక్ ఆటో యశ్వంత్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌పై హర్షం

కొత్తపేట, మే 7(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం నేతృత్వంలో సైనిక చర్య ఆపరేషన్ సిందూర్ చేపట్టడంపై బుధవారం కొత్తపేటలో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వారు జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ, మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్, నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, రవి, సుందర్‌నారాయణ పాల్గొన్నారు.

మోహన్‌నగర్‌లో..

ఆపరేషన్ సిందూర్‌ను హర్షిస్తూ కొత్తపేట మోహన్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు బోల్లం యశ్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో బాణసంచా పేలుస్తూ, జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, యువమోర్చా నాయకులు వినోదకుమార్, గౌరవ్‌షా, సంప్రీత్, యశ్వంత్ పాల్గొన్నారు.

దేశ సైనికుల ప్రతీ చర్యకు మద్దతుగా నిలుద్దాం

మన్సూరాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో పీఓకే, పాక్‌లోని టెర్రర్ స్థావరాలపై భారత సైనికులు చేసిన దాడితో పాటు ఇకపై దేశ రక్షణకు ఎలాంటి చర్యలకు పాల్పడినా ప్రతి భారతీయుడు మద్దతుగా నిలవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. పీఓకే, పాక్‌లోని టెర్రర్ స్థావరాలపై మంగళవారం భారత సైనికులు చేసిన దాడికి మద్దతుగా బుధవారం ఎల్బీనగర్ చౌరస్తాలో కార్పొరేటర్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, నాయకులు నాంపల్లి రామేశ్వర్, ఎస్.రంగారెడ్డి, యంజాల్ జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కిరణ్, మాధవి, విజయ్‌శ్రీ, ముత్యంరెడ్డి, కడారి యాదగిరి పాల్గొన్నారు.


ఎల్బీనగర్ చౌరస్తా వద్ద బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తదితరులు



పాకిస్థాన్ జెండాకు చెప్పులదండ వేసి కోడిగుడ్లు, టమాటాలతో కొడుతున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్, ఇతర బీజేపీ నేతలు


ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, సామ రంగారెడ్డి తదితరులు

పాకిస్థాన్‌పై కేంద్రం చేపట్టే చర్యలకు అండగా నిలవాలి

ఎల్బీనగర్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌పై కేంద్రం చేపట్టే అన్ని చర్యలకు అండగా నిలవాల్సిన అవసరం ఉన్నదని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అన్నారు. పాకిస్థాన్ ఉగ్రదాడులను ఖండిస్తూ బుధవారం సరూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో పాకిస్థాన్ జెండాకు చెప్పుల దండ వేసి గుడ్లు, టమాటాలతో కొట్టారు. పెండనీళ్లను పోశారు. రోడ్డుపై పాకిస్థాన్ జెండాలను పెట్టి తొక్కుతూ వాటిపై నుంచి వాహనాలను పోనిచ్చారు. అనంతరం పాకిస్థాన్ జెండాను తగులబెట్టారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ ఉగ్రవాదులకు, దేశద్రోహులకు భారత్‌లో స్థానం లేదన్నారు. వారిని ఎట్టి పరిస్థితిలో ఇక్కడ తిరగనిచ్చేది లేదన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ దాడులను కొనియాడారు. ఈ దాడులను ఇలాగే కొనసాగించి ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మూర్తి, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.